manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 204 | మంగళవారం | 21.01.2025



# బాలికపై లైంగిక దాడి..

## పోక్సో కేసు నమోదు?

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** ఆరేళ్ల బాలికపై ఓ కామాందుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఓ గ్రామంలో రెండు రోజుల కింద ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో భాదిత బాలిక స్కూలుకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉంది. ఆ సమయంలో ఆమె తల్లిదండ్రులు ఎవరు ఇంట్లో లేకపోవడంతో ఒంటరిగా ఉన్న బాలికపై కన్నేసిన అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిసింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రఘునాథపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. ఈ విషయం ఆ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి కామాందున్ని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

2

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

2

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



## ప్రజలు మోసపోయి గోసపడుతున్నారు

3

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

General News



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

■ **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. సోమవారం జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో చివరి రోజున కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఉంటారు? వృత్తి పరంగా ఏం చేస్తారు? మీసేవాలో ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారు? ఏమైనా వ్యవసాయ భూములు ఉన్నాయా? సాగు చేస్తున్నారా? వంటి తదితర వివరాలపై ఆరా తీశారు. అలాగే ఈ పథకాల సర్వే ప్రక్రియలో తప్పులకు అవకాశం ఇవ్వకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని, సభలకు అనువైన స్థలాన్ని గుర్తించి, బ్యానర్లు, మౌలిక సదుపాయాల వంటి తగిన ఏర్పాట్లు చేయాలని, అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదే విధంగా ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో ప్రదర్శించే లబ్ధిదారుల ముసాయిదా జాబితాపై ప్రజలతో మమేకమై చర్చించి, వారి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**జనగామ, మన చౌరాస్తా :** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న జరుపుకొనే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా సూచించారు. జాతీయ పతాకావిష్కరణలో భాగంగా ధర్మకంచ మినీ స్టేడియం, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, చెత్తాచెదారం లేకుండా పిచ్చి మొక్కలను తొలగించాలని, వివిధ శాఖల తరపున స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు గణతంత్ర దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాలను ఏఓ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో మన్సూర్, సీపీఓ పాపయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, ఎక్సైజ్ శాఖ పర్యవేక్షకురాలు కృష్ణవేణి, డిపిఆర్ఓ పల్లవి,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన, హర్టికల్చర్ అధికారి శ్రీధర్ రావు, డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్ హుస్సేన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.




## డ్రోన్ సర్వే షురూ..

**జనగామకు కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు పట్టణంలో డ్రోన్ ఏరియల్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సర్వేను సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో మినీ స్టేడియంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు.**



## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

■ **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**ములుగు , మన చౌరాస్తా :** రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, మహిళా సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో ఎదగడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్ సంపత్ రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ మహిళా క్యాంటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంలో భాగంగా కార్పొరేట్ కంపెనీల సహాయంతో 8 గ్రామాలను దత్తత తీసుకొని రూ. 2.5 కోట్ల లతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో రోడ్డు డ్రైనేజీ పనులను చేపట్టి సంవత్సర కాలంలో పూర్తి చేస్తామని అన్నారు. జిల్లా ప్రజలు అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నిర్మాణ పనులు రూ. 5.11 కోట్లతో హైటెక్ తరహాలో నిర్మించడంతో పాటు ఏటూర్ నాగారంలో బస్ డిపో ఏర్పాటు కోసం రూ. 7కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. యూనెస్కో గుర్తింపు పొందిన రామప్ప తో పాటు లక్నవరం, సమ్మక్క సారలమ్మ జాతర, బొగత జలపాతం పర్యాటకులను ఆకట్టుకునే విధంగా దట్టమైన అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందడానికి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించబోతున్నామని, ఈ శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు మంచి మనసుతో పనిచేస్తూ ప్రజలలో స్థిరస్థాయిగా నిలిచిపోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ జగదీష్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ లాల్, డిపిఓ దేవరాజ్, ఏపీడి బాలస్వామి, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారిగా మనోజ్ కుమార్



**జనగామ టౌన్, మన చౌరాస్తా :** తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఎన్నికలు సోమవారం హైదరాబాద్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో జనగామకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ గంగిశెట్టి మనోజ్ కుమార్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఎన్నికైన మనోజ్‌ను జనగామ జిల్లా తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు గౌర్సింగ్, కోశాధికారి కొండ రవి, జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి ఆవుల అశోక్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడు సుగుణాకర్ గౌడ్, కార్యదర్శి హనుమంత రావు తదితరులు అభినందించారు.

Local News



# ప్రజలు మోసపోయి.. గోసపడుతున్నారు

- ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలి
- కాంగ్రెస్ ఏడాది కాలంలో ఒరగబెట్టింది ఏమిలేదు
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ఏ భయం లేకుండా ప్రశ్నించండి.. మోసాలపై ప్రజల్లో చర్చ పెట్టాలి అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. సోమవారం జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో బచ్చన్నపేట, జనగామ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎలా చేశాం.. ఇప్పుడెలా ఉందో..? వివరంగా ప్రజలకు చెప్పాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ పాత రోజులు వచ్చాయని, వేరే రాష్ట్రాలకు బతకపోయే పరిస్థితి రానున్నదని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ ఆగం కావద్దని, ఆగం చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టాలని, పార్టీతో పాటు ప్రజల్లో పేరుంటేనే ఎన్నికల్లో గెలవగలుతామన్నారు. కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల్లో అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి రేషన్ కార్డులు ఇస్తామని నమ్మించి మోసం చేసిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ నమ్మి గోసడుతున్నారని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిద్దిలింగం, కౌన్సిలర్ ప్రేమలతారెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఇర్రి రమణారెడ్డి, మేకల కలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యక్షగాన కళాకారులు ప్రశంసనీయులు

**దేవరుప్పుల , మన చౌరాస్తా :** యక్షగాన కళాకారులు తమ ప్రతిభతో సాంప్రదాయ కళను కొనసాగించడం ఎంతో ప్రశంసనీయమని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. ఈ కళాకారులను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఈ కళను అందించగలమన్నారు. దేవరుప్పల మండలం చిన్నమదూరు గ్రామంలో నిర్వహించిన శ్రీ సోమేశ్వర చిందు యక్షగాన రెండో వార్షికోత్సవాలకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.....యక్షగానాన్ని భారతీయ సాంప్రదాయ కళలలో ఒక అద్భుతమైన కళారూపంగా అభివర్ణించారు. ఈ కళాకారులను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఈ కళను అందించగలమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ విధమైన సాంస్కృతిక కార్యక్రమాలకు , కళారూపాలకు మద్దతు ఇవ్వడానికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య , ప్రముఖులు, మండల నాయకులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.





## మోక్ష సిద్ధికి మార్గం ధర్మం

- బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** సమాజంలో మానవులు మోక్ష సిద్ధి పొందాలంటే ధర్మాన్ని ఆచరించాలని బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం అష్టాదశ పురాణాల్లో 18వ పురాణం శ్రీస్కాంద మహాపురాణ ప్రవచన పరాయనం చేశారు. గణపతికి ఇష్టమైన చతుర్థి తిథి రోజున ఎటువంటి నియమాలు పాటించాలి, దేవాలయంలో ఆచరించే సూక్ష్మమైన నియమాలు పాటించడం ద్వారా పొందే ఫలితాలను ఆయన వివరించారు. కాగా అష్టాదశ పురాణం కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి జనగామ రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు పురాణం మహేశ్వరం శర్మ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మతో పాటు భక్త బృందం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ, మన చౌరాస్తా :** గురుకులాల్లో ఐదో తరగతి నుంచి 8వ తరగతితో పాటు ఇంటర్ ఫస్టియర్ లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రవీందర్ తెలిపారు. మైనార్టీ కోటాలో ఫస్ట్ కం ఫస్ట్ బేసిస్ అడ్మిషన్, నాన్ మైనార్టీ కోటాలో లక్కీ డిప్ ద్వారా సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. జనగామ లోని షామీర్‌పేట్, స్టేషన్ ఘన్పూర్ మండలం నమలిగొండలలో స్కూల్ కం కళాశాలలో విద్య అభ్యసించేందుకు 2025-26 విద్యా సంవత్సరంనకు అర్హులైన వారు tmreis.telangana.gov.in లో 2025 ఫిబ్రవరి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఆయా మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

## సదరం క్యాంపు కోసం దఖాస్తు చేసుకోండి

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** దివ్యాంగులు సదరం క్యాంపులో పాల్గొనేందుకు మీసేవ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కొత్త వారికి నిరంతరం అని, రెన్యూవల్ చేసుకునే వారు ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 11:30 గంటలకు స్లాట్ బుక్ చేసుకోవచ్చునని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్.వసంత తెలిపారు. సదరం క్యాంపులో మీసేవ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే రెన్యువల్స్ 24న 5 దృష్టిలోపం, 10 వినికిడి లోపం, 28, 30 తేదీల్లో ఆర్థో 20, 29న 25 మానసిక మొత్తంగా 60 ఉన్నాయని, ఈ నెలలో కొత్త వారు మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న వారికి 410 మందికి అవకాశం ఉందని తెలిపారు.




## హక్కులపై అవగాహన అవసరం

**భూపాలపల్లి, మన చౌరాస్తా :** రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులు తెలియజేయాలనే ఉద్దేశంతో టేకుమట్ల మండల కేంద్రంలో రాజకీయ అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీరాజ్ విధులు, ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీ అధికారాలు, పోటీ చేయడానికి కావాల్సిన అర్హతల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు ఆకుల శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎప్పుడైతే నాయకులకు తెలుస్తాయో అప్పుడే ప్రజల తరుపున పోరాడగలడని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి జనసైనికుడు ప్రజల హక్కుల కోసం, ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలని, అవి అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ విధులు గురించి తెలియచేశారు. ప్రజలకు వారి హక్కులు తెలియజేస్తూ, ప్రశ్నించే గుణం అలవాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మల ప్రవీణ్, చారీ, మహిపాల్, దుడం రాజు, సాధిక్, రాజేష్, మనోజ్, రమేష్, పవన్ పాల్గొన్నారు.

## ముగ్గురు సీఐల బదిలీ

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఇన్స్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయినవారిలో వరంగల్ కు అలాట్ అయిన ఎస్. శ్రీనివాస్ ను నెక్కొండ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ గా, ఇక్కడి ఇన్స్ స్పెక్టర్ చంద్రమోహన్ ఎస్ బి కి అలాగే ఎస్. బి లో వున్న ప్రతాప్ ను మల్టీ జోన్ కు బదిలీ అయ్యారు.




## భారీ అంచనాలతో

# తండేల్

సంక్రాంతి కానుకగా ప్రతి సంవత్సరం ఏవో కొన్ని సినిమాలు రిలీజ్ అవుతూనే ఉంటాయి. ఈ సంవత్సరం సంక్రాంతి మూడు బడా సినిమాలు విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు అందరి చూపు తండేల్ సినిమాపైనే పడిరది. యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం తండేల్. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయింది. ఈ సినిమాకు చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. నాగచైతన్య సరసన హీరోయిన్‌గా సాయి పల్లవి అద్భుతంగా నటించింది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకుల్లో భారీగా అంచనాలను పెంచేస్తున్నాయి. వాలెంటైన్స్ వీక్ లో ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా రానుంది. దీంతో ఈ సినిమాపై అభిమానుల లోనే కాకుండా, ట్రేడ్ లోను భారీగా అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే తండేల్ సినిమా నుంచి విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి ట్రేమండస్ రెస్పాన్స్ వస్తోంది. టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా.... బుజ్జి తల్లి, నమో నమః శివాయ పాటలు చాట్ బస్టర్ గా నిలిచాయి. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ పాటలే వినిపిస్తున్నాయి. ఇదంతా సినిమా చుట్టూ బలమైన ఆశలను పెంచుతోంది. బాక్సాఫీస్ వద్ద కచ్చితంగా మ్యాజిక్ చేస్తుందని నమ్మకాన్ని కలిగిస్తోంది. గతంలో నాగచైతన్య, సాయి పల్లవి కలిసి నటించిన “లవ్ స్టోరీ” సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. రాజు, బుజ్జి తల్లి అని ఇద్దరి మధ్య జరిగే అద్భుతమైన గ్రామీణ ప్రేమ కథతో సినిమా విడుదల కాబోతోంది.